కథా నిలయం
3686
శ్రీకాకుళం

# వాయులీనం

"అతన్నీ క్షేమవుతాడు?" అనడిగాడు చూట్టూ చూసి "మా నా య నే" అన్నాడా కుర్రాడు.

"నాకు నేర్చుకోవాలనుంది. ఎంతో బావుంటుంది. నాకు పిల్లంగోరు నేర్పమంటే నేర్పుతాడా?" అనడిగాడు ఆశాపూరితంగా చూస్తూ.

"నాకు వచ్చు నేన్నేర్పగల్ను" కంఠంలో ధీమా ధ్వనించింది.

"అబ్బా నీకూ వచ్చా! నాకే రాదుగాని"

ఆశ్చర్యమూ అపనమ్మకమూ పెనగొన్నయ్. ఆ కుర్రాడదోలా చూశాడు.

"సరేగాని....పోనీ మీ నాన్నను నేర్పమనగూడదూ.... అ స లు నేర్పమంటే నేర్పుతాడాని........ఇంతకు ముందెవరికేనా నేర్పేడా?"

"ఎవరూ నేర్పమని అడగలా ఇంతవరకు."

భయం వేసిందతనికి. ఓ వేళ నేర్పడేమో....?!?

చూపులు చుట్టూ తిప్పాడు నిస్సహాయంగా.

"ఆ పిల్లెవరూ....?" అన్నాడు. గు డా ర ం దగ్గిర జుట్టెగదీసుకుంటూ కూచున్న చిన్నపిల్లను చూపించి

"మా చెల్లెలే"

"ఏం పేరు?"

"రాణి"

నవ్వొచ్చిందతనికి. అలాటి పేరు తను ఇంతకు మునుపు వినలేదు.

"రాణీ ఏంటి....కాణీకి మల్లే!" అన్నాడు నవ్వాపు జేసుకుంటూ.

"నీ పేరేంటో చెప్పు....?" అన్నాడు చెల్లెలి పేరు విని నవ్వుతుంటే ఓపలేక, కోపంతో

అది ఇంత వరకూ తనను ఎవరూ అడగని ప్రశ్న!! ఏం జెప్పడం? తన పేరు....! అవును.... అసలు—తనకు పేరుందా? ఏదోటి చెప్పాలి. తన్నందరూ ఒరే- అని పిలుస్తారు. అంతేగాని తనకు పేరులేందే!

"చెప్పవే! ఏంటీ నీ పేరు?" అని మళ్లా అడిగాడా కుర్రాడు.

అందరూ 'ఒరే' అనిపిలిస్తే సీతన్నగారి పాలేరు మాదన్న మాత్రం తనను అప్పుడప్పుడూ "పిల్లోడా" అని పిలుస్తాడు. అదే చెప్పాడు.

ఆ కుర్రాడు ఒక్కపెట్టున నవ్వాడు. గుడారం గుమ్మం దగ్గిర కూచున్న రాణి బెదిరింది.

'పిల్లోడేంటి? పిల్లంగోరులాగ' అన్నాడా కుర్రాడు నవ్వాపు చేసుకుని.

బిక్క మొహం వేశాడు, రాణీకేసి చూస్తూ

ఇక వీణ్ణడిగితే లాభంలేదని తెలిసిపోయింది.

"ఎన్నాళ్ళుంటారీ వూళ్లో" అనడిగాడు పోనీ అదేనా సరిగాచెప్పు అన్నట్టు చూస్తూ.

"మేమా....అబ్బో! వారంరోజులు పైగా ఉంటాం....ఏదీ నిన్నేగా వొస్త"

సుడిగాలికి లేచే కెరటాలకు మల్లే అతనిలోని ఆనందం నురుగులు గక్కుతూ పొంగింది.... అక్కణ్ణుంచి కదిలాడు.

రేపు తప్పకుండా అతన్నడిగెయ్యాలి, తనకు పిల్లంగోరు నేర్పమని. అబ్బ....!....పిల్లంగోరు ఊత్తుంటే ఎంత బావుంటుంది. అలా ఊదుదామంటే తనకురాదు. ఎలగయినా నేర్చేసుకోవాలి. కాలవొడ్డున చెట్టుకింద కూచుని ఎంచక్కా వూదుకోవచ్చు; లేదా తుమ్మ చెట్టుకిందయినా కూచుని ఊదుకోవచ్చు. వీలయితే నేస్తాలక్కూడా నేర్పితే నేర్పొచ్చు అందరూ కలసి పిల్లంగోరు ఊదుకుంటూ మందల్ని తోలుకొని పొలానికి పోవచ్చు....ఊహా సౌధాలు ఆకాశాన్నంటాయ్.

ఆవుల్ని తోలుకెళ్ళే వేళ కావస్తున్నది. ఖామందు కూకలేస్తాడేమో—? పరుగు పరుగున ఖామందు ఇల్లు చేరుకున్నాడు. గాడి పక్కనుంచి సాల చేరుకుని వెల్లావు దగ్గిర కెళ్ళి పలుపు తియ్యడం ప్రారంభించాడు గబగబా....ఇంతలో యజమానురాలు [ఖామందు భార్య] ఎక్కణ్ణుంచో ప్రత్యక్షమయింది.

"ఎక్కడ చచ్చావురా ఇంతసేపూనూ....ముదనష్టపోడా"

"ఎక్కడికీ యెళ్ళలా! యీ గాదికాడే వున్నా" ఆవిడకేసి చూడకుండా సమాధానం చెప్పాడు.

"చద్దికూడు తినడానికి రాలేదేమరి?" అని గద్దించింది.

"ఆకలి కాలా! ఇప్పుడొస్తన్నా"

ఎర్రగా చూసి గిరుక్కున లోపలికెళ్ళిపోయింది.

పిల్లోడు గబ గబా వెళ్ళి చల్దన్నం తినేసొచ్చాడు. ఆవుల్ని తోలుకుంటూ బయల్దేరాడు. దారిలో ఓ ఆలోచన తట్టింది. తనే అందాక ఓ పిల్లంగోరు చేసుకుంటే....! ఓ సన్న పాటి వెదురుకర్రవిరిచి కొడవలితో సాపుచేశాడు. ఆ తరువాత ఏంచేయాలో తోచలేదు. ఆలోచించగా ఆలోచించగా కన్నాలున్నాయనే సంగతి జ్ఞాపకం వచ్చింది. కన్నాలు కొట్టబోతే కర్ర బద్దలైపోయింది. ఎంతకీ చేతగాలేదు. మనసు విలవిల్లాడింది. నేస్తాల్ని పలకరించలేదు. సాయంత్రందాకా ఏలాగో గడిపేశాడు. చీకట్లు కమ్ముతుండగా మందల్ని తోలుకొచ్చాడు. తను రోజూ మామూలుగా చెయ్యాల్సిన మిగతాపన్లు పూర్తిచేశాడు. ఖామందమ్మ పోసిన అంబలి తాగి గాది కింద పడుకున్నాడు.

మోళీ ఆసామి దగ్గర తను పిల్లంగోరు నేర్చుకున్నట్టు కలొచ్చింది, తను ఎంచక్కా ఊత్తున్నాడు.తనస్తమాను పిల్లంగోరు పిల్లంగోరు అంటుంటే అతగాడు పిల్లంగోరు కాదు "వాయులీనం" అన్నాడు, తనకు పలకడం రాలేదు. ఆయులీనం అన్నాడు. రాణి అన్న నవ్వాడు. కష్టపడి చివరకు వాయులీనం అన్నాడు. మరోసారి మరోసారి వాయులీనం అనుకున్నాడు సరదా తీరక. మెలకువొచ్చింది.

దూరంగా వున్న వేపచెట్టుమీద గోరింకలు కూస్తున్నాయి. చీకట్లు విచ్చుకుని వెలుగు రేకలు వ్యాపిస్తున్నాయి. ఆ వెలుగులోంచి చల్లని మెల్లని గాలి వీచి ఒంటికి హాయి గొలుపుతున్నది. ఒక్కసారిగా లేచి నిలుచుని ఒళ్ళు విరుచుకుని బద్ధకం తీర్చుకున్నాడు. కల లీలగా జ్ఞాపకం వచ్చింది. వాయులీనం అందామనుకున్నాడు. గానీ రాలేదు. తను పిల్లంగోరు ఊదుతుండడం కళ్ళల్లో మెదిలి ఉబ్బిపోయాడు. ఏనాటికైనా తనకు పిల్లంగోరు ఊదటం వస్తుందనే గట్టి నమ్మకమొకటి అతనిలో వేళ్ళు తన్నింది—మానవుడు ఆశాజీవి.

గొడ్లకు గడ్డివేశాడు. వాకిట్లో కళ్ళాపు జల్లాడు. కొట్టం శుభ్రంగా ఊడ్చాడు అప్పటికి బాగా తెల్లవారవస్తుంది. కడవ పట్టుకుని కాలవకు బయలుదేరాడు, నీళ్లు తెచ్చేందుకు....ఖామందుగారింటికీ, కాలువకూ అట్టే దూరంలేదు. కాలవ గట్టునే అతను నీళ్ళుముంచే రేవుకు కొంచెం దూరంలో మోళీవాడి గుడారం వుంది. వెళ్ళి కలుసుకుందామనుకున్నాడు. అక్కడికివెళ్ళి ఏమనడగాలో అర్థంకాలేదు........ ఇంతెందుకు? ఇంకాబాగా పొద్దెక్కితే అతనే మోళీగడతాడు. అప్పుడు జనం పోగవుతారు. పిల్లంగోరు ఊదుతూ తమాషాలు చేస్తాడు. అప్పుడు కలుసుకుంటేనే మంచిదిలా కనిపించింది. కాని తనకు పనుంటుందిగా అప్పుడు?....ఖామందమ్మ రానీయదాయె. ఎలాగ....? పోనీ మందను తోలుకెళ్ళే ముందు ఇలాగొకసారొస్తే సరి, ఏ సంగతీ అడగొచ్చు.

ఆఖరి కడవ ముంచుకుని, నెత్తికెత్తుకొని ఇంటిదారి పట్టాడు.

ముంతలు పట్టుకొని పాలు పితకడానికి బయల్దేరాడు. అతను పాలు పితకడం ప్రారంభించి ఓ నెలపైబడుతుంది. అంతకు ముందు ఖామందమ్మ పితికేది. కాస్త కాస్త పెద్దవాడవుతున్నాడు కనుక ఆ పనికూడా తనకే అంటగట్టింది. మొదటి రోజుల్లో భయంగా వుండేదిగాని ఇప్పుడలవాటయిపోయింది. ఒక రోజున మచ్చ లావు తన పాలుపితుకుతుంటే తన్నిందికూడానూ.... అప్పుడు పాలన్నీ ఒలిగిపోతే ఖామందమ్మ కూడా తన్నింది.

పాలు పితికిన ముంతలు మూడు పట్టుకొని లోపలికెళ్లాడు.

అతనికి తల్లెవరో తండ్రెవరో తెలీదు. కాని ఖామందు ఖామందమ్మ తల్లి దండ్రులు కాదని బాగా తెలుసు. వాళ్లను అయ్యా! అమ్మా అనే పిలుస్తాడు. తల్లె వరు అనిగాని తండ్రెవరనిగాని వాళ్ళనడగలేదు. అసలా ఆలోచన అతన్లో ప్రవే శించలేదు. ఊహ తెలిసిన దగ్గర్నుంచీ అతని దినచర్య ఇప్పటిలాగేవుంది. తన కిప్పుడు పన్నెండేళ్ళనీ ఇక రెండు మూడేళ్ళుపోతే పొలం దున్నడానికి కూడా పంపవచ్చుననీ విన్నాడొకసారి.

మిగతా పనులు కూడా పూర్తిచేసుకొని, చద్దికూడుతిని, బయలుదేరాడు మందవెంట ఊరవతలదాకా కూడా వెళ్ళి మళ్లా వెనక్కొచ్చాడు, కాలవ గట్టమ్మటే. దూరంగా మర్రిచెట్టుకింద గుడారం కనిపించింది. మర్రిచెట్టు ఊడలు కాలువలో వేలాడుతున్నాయ్. మోళీ అయిపోయింది గామోసు అతగాడు గుడారం బయటనే నిలబడున్నాడు. మీసాలు మెలేసుకుంటూ ఎటో చూస్తున్నాడు. అందరూ లోపలు న్నారు. పొడుగు చుట్టగూడా నోట్లోవుంది.

బెరుకు బెరుగ్గా దగ్గిరికెళ్లాడు.

రెండు ఎండుటాకులు కింద రాలినయ్.

"ఇదిగో....అయ్యా...."అన్నాడు. అతనికేసి చూస్తూ. కళ్ళు ఓ విధమయిన ఆశతో వెలుగుతున్నాయ్.

ఇటుకేసి తిరిగి కళ్ళుదించి చూశాడు, ఏమన్నట్టు—

"నేను....మరే....నేను పిల్లంగోరు నేర్చుకుంటా!.... హుఁ.. అవును" నాలిక నములుతున్నాడు వెల్లావుకు మల్లే—

అయితే ఏంజేయ్యమంటావన్నట్టు చూశాడు, ఎర్రటి కళ్ళతో .. తుపుక్కున ఉమ్ముతూ. లోపల్నుంచి రాణిఅన్న గామోసు పిల్లంగోరుఊత్తున్నాడు సన్నంగా.

"అదే ...అయులీనం .. నాకునేర్పాలి! నేర్చుకుంటా.. !" అన్నాడు మళ్లా. విరిగిన పళ్ళు కనిపించేలా చిన్న నవ్వు నవ్వాడతగాడు. కొంచెం ధైర్యంవచ్చింది.

''అవును....అది....భేలా బాగుంటుంది.''

తనుగూడా కొంచెం నవ్వుతూ అన్నాడు.

నిశ్శబ్దం. అతను ఏమీ మాటాడలేదు.

పక్కనున్న కాలవ చప్పుడు చెయ్యడంలేదు.

మర్రిచెట్టు ఊడలు కదులుతున్నాయి. కాలవలో చిన్న చిన్న అలలు పుట్టి పెద్దవై చెదిరిపోతున్నాయి. ఆఖరిసారిగా పీల్చి, చుట్ట దూరంగా పారేసి తుపుక్కున ఉమ్మి ఖాసం ఒకసారి దువ్వుకుని లోపలి కెళ్ళిపోయాడా ఆసామీ....

స్తబ్ధంగా నిల్చుండిపోయాడు కుర్రాడు,

రాణి ఏడుపు వినిపించింది గుడారంలోంచి

ఆ పిల్ల అన్నగారి పిల్లంగోరు ఆగిపోయింది.

కొంచెందూరంలో కట్టివున్న కుక్క అతనొక్కణ్ణే చూసి, కాస్త "గుయ్‌గుయ్" లాడింది, మొరుగుదామా, మానేద్దామా అని ఆలోచిస్తూ—

ఏం చెయ్యాలో తోచలేదు.

నోరు తెరుచుకుని ఉన్నదన్న సంగతి గ్రహించి, పెదాలు మూసుకొని మెడ మీద గోక్కున్నాడు, అలవాటుగా—

బహుశా రేపు వస్తే మంచిదేమో....

అప్రియత్నంగానే వెనక్కి తిరిగి మళ్ళా పొలం దారి పట్టాడు. మనస్సు వికలమయిపోయింది. కొంపముంచి తనకది రాదేమో....?

ఆలయంలో గంటలు వినిపించాయి.

"అబ్బో వేళ మించిపోయిందే" అనుకున్నాడు. అడుగులు గబ గబా వేస్తూ నడక సాగించాడు కొద్దిసేపట్లో మందను చేరుకున్నాడు. ఇంతలో సీతన్నగారి మాదన్న, మచ్చలావును బాదుతూ వచ్చాడు.

"పిల్లోడా! ఎక్కడికి బోయా? సూడరా మీ మచ్చలావు పెసర సేలలో పడింది. సుబ్బరంగా ప ది గ జా ల మే ర నాశనం చేసింది.....చెప్తానుండు మీ ఖామందుతో...."

"అబ్బే ఇక్కడేగా వుంటా. యెట్టొచ్చిందబ్బా" అన్నాడేమీ ఎరగనట్టు—భయపడుతూ.

"ఆఁ! ఆఁ! చాల్చాల్లే! నువ్విప్పుడేగా వొస్త....నేం చూళ్ళేదనుకున్నావా.. యివాళిదయిందె.రేపు మరోటవ్వద్ది.... మీ యజమాన్తో చెప్తేగాని" అంటూనే మాట పూర్తి చెయ్యకుండా వెళ్ళిపోయాడు చెప్పొద్దని చెప్పడానికూడా అవకాశం చిక్కలా. మనసులో వణుకు పట్టుకుంది. ఖామందుతో చెప్తే మరేం పరవా

లేదు; రెండు కేకలేసి ఊరుకుంటాడు. అంతేగాని కొట్టడు అమ్మగారితో చెప్పాడా ఒళ్ళు చిట్లిందన్న మాటే. అయినా.... ఈ దరిద్రపుగొట్టు మచ్చ లావు ఎప్పుడూ అంతే.... తనను తన్నించడం తప్ప దానికిక పనిలేదు గామోసు—

తుమ్మ చెట్లలోంచి గాలి ఈలలు వేసుకుంటూ వస్తున్నది. మందను ఇటు కేసి మళ్ళించి ఓ చెట్టుకింద కూచున్నాడు. సూర్యుడికి భయపడి చెట్టునీడ చెట్టు కిందకే చేరుకుంది. ఎండ నిప్పులు గ్రక్కుతుంది. మిగతా నేస్తాలు పక్క చెట్ల కింద గోలీకాయలాడుకుంటున్నారు.

పిల్లంగోరు గురించి ఆలోచన్లు మళ్లీ రేగినయ్.

ఛస్! పిల్లంగోరు అనకూడదింక....వాయులీనం అంటుండాలి. అది వింటుంటే తనకెందుకింత ఆనందం వెల్లుబుకుతుంది? అది నేర్చుకోవాలనుకోవడం తన తప్పు మాత్రం గాదు. దాన్నెవరు అంతచేటు బాగోమన్నారు? అది బావుంటుంది కనుక తనకు నేర్చుకోవాలనిపించింది. తను గనుక పిల్లంగోరు ఊత్తుంటే.... అదేవాయులీనం ఊత్తుంటే చుట్టూ పిల్లలందరూ తన దగ్గిరచేరి బుర్ర లూపుతారు. తనకేసి గౌరవంగా చూస్తారు. హుఁ తస్సదియ్య! అప్పుడెంత బావుంటుందో....బలే....

నీడ చెట్టునొదిలి దూరంగా పారిపోయింది. ఎండ చురుక్కుమంది ఒంటి మీద పడి. ఆవులు దూరం దూరంగా మేస్తున్నాయి. కొందరు కుర్రాళ్ళు చిన్న చెరువులో దిగి గేదెల్ని కడుగుతున్నారు. నీడపడే చోటుకి పోయి కూచున్నాడు కాసేపు.

గాలిని ముక్కుతో పొడిచేసి ముందుకు సాగిపోతున్నాయి-కొంగలు. తమను కూడా పొడిచేస్తాయేమోనని వాటి కాళ్ళ కిందనించి జారి తప్పుకుంటున్నాయి— మేఘాలు. యజమానురాలిచేత దెబ్బలు తిన్నట్టు సూరీడి మొహం ఎర్రబడింది,

ఎదురుగా వున్న తుమ్మచెట్టు మీదకు పిట్టలన్నీ చేరుకోగానే, అతను ఇంటికి బయలుదేరాడు- మందల్ని తోలుకుని ఒకటి.... రెండు ... మూడు.... పద కొండు! లెక్క పెట్టుకుని మామూలుగా వాటి వెంట నడుస్తున్నాడు.

నడుంమీద చెయ్యేసుకుని, అరుగుమీద నిలబడి ఆకాశంలోంచి కిందకు చూసినట్టు చూస్తూంది రోడ్డు మీదకి—ఖామందమ్మ. కనబడకుండా వుండాలని వెల్లావు వెనకాలే తారాట్లాడుతూ దొడ్లోకి దారితీశాడు.

"ఔరేయ్....మా టిలారా!"

ఆ అరుపుకు తనే అదిరిపోయినట్టు కనిపించింది....దవడలు కదిలినయ్...

బిక్కమొహం వేసి, జాలిగా చూశాడు.

"నిన్నే ....రా యిటు"

వెళ్లాడు అలవాటుగా మెడమీద గోక్కుంటూ.

''ఎటు జచ్చేవ్ పొర్రిద్దున్న —'' మెట్టు దిగుతూ గర్జించింది.

దూరంనుంచి ఎవరో పిల్లంగోరు ఊదుతూ వస్తున్నారు. అటుకేసి చూశాడు, ''యక్కడికి యెళ్ళలా''అని అబద్ధం ఆడుతూనే. దూరంగా రాణి అన్న అకనిపించాడు—పిల్లంగోరు ఊదుకుంటూ యిటే వస్తున్నాడు. మందలో ఆఖర్ని వున్న మచ్చలావు ఒకసారి తనకేసి చూసి, వెళ్ళిపోయింది.

''ఏటార్రి జూస్తున్నావ్! చచ్చినోడా! ఆ మాదన్న చెప్పలేదనుకున్నావా?'' దవడ ఫెళ్ళుమంది.

''ఆళ్ళ పెసర చేనులోకి వదిలేశావటగా మచ్చలావుని. మంచోడు గనక సరిపోయిందిగానీ బందిలి దొడ్లో కట్టేస్తే నో! ఎక్కడేడిశావంట! మాటాడవేం!'' మళ్లా నాలుగు తగిలాయ్.

ఖామందు ఇంట్లోంచి వచ్చాడు, చుట్టకొరుకుతూ—అగ్గిపెట్టెతో చుట్ట వెలిగించుకొని, ''ఎందుకే కొడతావ్? నువ్వెళ్ళు లోపలికి.... నేజూస్తా''—

''ఏం రా బుద్ధిలే'' అన్నాడు అడ్డం వస్తూ.

పిల్లోడు బిక్కచచ్చిపోయాడు. ఏడవటం లేదు.

''నువ్వడ్డమొచ్చావ్గాని .......పళ్లు రాలిపోను యెదవకియ్యాల'' అంటూ వెనక్కు తగ్గి లోపలికెళ్లిపోయింది.

''ఎక్కడికి పోయావార్రి'' అన్నాడు యజమాని అరుగుమీద కూచుంటూ.

ఇంతలో రాణి అన్న ఆ దారిన వచ్చాడు. పిల్లోడికేసి చూసి నవ్వాడు.... నీళ్లు దిరిగిన కళ్ళలోంచి స్నేహపూర్వకంగా తనూ నవ్వాడు.

"వాయులీనం నేర్చుకుందామని" అన్నాడు నానిన గొంతుతో—అతి కష్టం మీద. బోధ్యం చూస్తున్నట్టు రాణి అన్న ఆగిపోయాడు.... "ఏటీ" అన్నాడు. యజమాని తుపుక్కున ఉమ్మి. తను వాడిన మాట అంత పెద్ద పెద్ద మీసాలున్న యజమానికూ్కడా అర్థంకానందుకు.... గొప్ప ఇదయిపోయాడు.

"అదే పిల్లంగోరు....నేర్చుకోడానికి" రాణి అన్న నవ్వేడు.

"ఎక్కడికీ?" రెట్టించాడు యజమాని,

"మోళీవోడి కాడికి" రాణి అన్నకేసి చూస్తూ అన్నాడు.

"నేరిపేడా" "లేదు" కాసేపు నిశ్శబ్దం.

రాణి అన్న పిల్లంగోరు ఊదుకుంటూ కదిలాడక్కణ్ణుంచి. కదిలే ముందు "అడిగాడు; మా అయ్య కిరాణా కొట్టుకాడ బియ్యం దెమ్మన్నాడు. కొట్టెక్కడ?"

"ఈ యీది చివరికెళ్ళు" అన్నాడు సమాధానంగా. వెళిపోయాడు.

పిల్లంగోరు పాటతో పాటు మనసు గూడా బయల్దేరింది దాని వెంట.

"సరేలే! జాగర్తగా మసులు! పోయిపజ్జొనుకో యదవేషాలెయ్యక" అన్న యజమాని కంచు గొంతు విని మనసు వెనక్కొచ్చింది.

"యెంత బావుంటుంది అది ఊత్తుంటే" అన్నాడు పొంగిపోతూ, "నేర్చుకో పోనీ" అంటాడేమో అనుకుంటూ. యజమాని మాటాడలేదు. మ న సు చల్లారి పోయింది. కాస్సేపక్కడే నిలబడి దొడ్లోకి దారితీశాడు ఆవులకు కు డి తి పెడు తుంటే ఆలోచనలు రేగుతున్నాయ్.

....బియ్యం కొనుక్కుని రాణి అన్న మళ్లా ఇలాగే వస్తాడు. అప్పుడడిగితే పిల్లంగోరిచ్చెయ్యమని? కావలిస్తే రేపు పుచ్చకాయలు, దోసకాయలు పట్టుకెళ్ళి ఇవ్వొచ్చు. య జ మా న మ్మ క స్త క న్ను ఆటు పె డి తే నాలుగైదు దోసిళ్ళ వడ్లుకూడా ఇవ్వొచ్చు....వా యు లీ న ం వినిపించింది. వస్తున్నట్టున్నాడు. సాలలోనుంచి బయటికొచ్చాడు.

"ఉష్! యిదిగో! యిలార్రి మాట ..." పిలిచాడు బెదురుగా. కొంచెం దగ్గిర కొచ్చి "ఏఁ?" అన్నాడు రాణి అన్న.

"గట్టిగా మాటాడకు. నీకు రేపు బోల్డు దోసకాయలు, పుచ్చకాయలూ పొలం నుంచి తెచ్చిపెడతా. యీలయితే పక్కా యిస్తా....అది....నీ చేతిలోది.... ఆ పిల్లంగోరియ్యవ్....నేర్చుకుంటా —ఉఁ"

"అమ్మో మా బాబు నా యీపు పగలెయ్యడూ?"

నిస్సహాయంగా జాలిగా చూశాడు. రాణి అన్న. చెప్పాడు నెమ్మదిగా.... చెవిలో ఏదో.... పిల్లాడి కళ్ళు ఆనందంగా మెరిశాయి, ఆ మాటలు విని.

"యేఁ? గేపకం వుందా? రేపు రేతిరి తప్పకుండా చేసుంచుతా"

రాణి అన్న గబ గబా వెళ్ళిపోయాడు.

ఆనందంతో కొంపముంచి గుండె బద్దలైపోతుందేమోననిపించింది. వెర్రిగా సాల్లోనే గంతులేశాడు. త ను వాయులీనంలో ప్రవీణుడయినట్టే సంతోషపడి పోయాడు. పనులు జోరుగా పూర్తిజేశాడు. పన్నెండేళ్ళలో మొదటిసారిగా కులాసా కూనిరాగం తీశాడు. అంత ఆనందం పట్టలేక ఉదయిస్తున్న చంద్రుణ్ణి చూసి కన్ను గిలికాడు. వెల్లావు నుదురు ముద్దు పెట్టుకున్నాడు. వరదలొచ్చిన నదికిమల్లే ఆనందం పెల్లుబుకుతూంది. వెధవది....ఎంత దబ్బున కా ల ం గడు

స్తుందా అని ఉంది. పడుకుంటే నిద్రె పట్టలేదు. హు! తనకు.... పిల్లంగోరు వచ్చేసినట్టే....భస్....వాయులీనం....అబ్బా....

ఇలాంటి ఆనందం ఇంతకు ముందెరుగడు. ఆనందం ఇలా ఉంటుందని ఇంతకుముందు తెలియదు. ఆ తెలియని ఆనందం వాయులీనంతో ప్రారంభించడం విచిత్రం...పిల్లాడు అంతచేటు ఆనందం అనుభవిస్తూంటే చూస్తూ ఊరుకోలేక ఉక్రోషంవచ్చి వెన్నెలంతా ప్రపంచం మీదకు ఊసేస్తున్నాడు చంద్రుడు. ఎలాగో తెల్లవారింది. కా ల ం గడవనంటుంది....

పెద్ద పెద్దవి దోసకాయలూ, చాలా మంచివని తోచినవి రెండు పచ్చ కాయలూ కోసుకున్నాడు. ఇవి ఇంటికి పట్టికెళితే ప్ర మా ద ం! ఖామందమ్మ చూసిందంటే చంపుతుంది ...రాత్రికి మళ్లా చంద్రుడు రానేవస్తాడు. రాణి అన్న దగ్గరకెళ్ళే ముందు ఇలావచ్చి, అడ్డదారిన అటు తీసుకెళితే మంచిది. వద్దు సంపా యిద్దామంటే కుదరనే లేదు—

ఇంకా చేసేడో లేదో పిల్లంగోరు? చే సే ఉంటాడు. బా గా చే స్తో చ్చి ఉంటుంది. తనకు నేర్పుతానన్నాడు కూడాను. ఎంత మంచోడో? చాలా మంచోడు....లేకపోతే తనకు నేర్పుతాడా? కోసిన వన్నీ గుర్తుగా ఒక పొదలో దాచి ఇంటిదారి పట్టాడు.

....గాలి రివ్వున కొడుతూంది. వాయుదేవుడుకూడా ఉషారుగా ఉన్నాడు. ఏం సరదా పుట్టిందో ఏమో.... కొబ్బరిచెట్లు ఊగిపోతున్నాయ్. దుమ్ము రేగు తూంది. లేగలు పైకెగిరి చెంగు చెంగున గంతులేస్తున్నాయ్. ఆ వు లు "అంబా" అంటూ ముందుకు సాగిపోతున్నాయ్....

పనులన్నీ పూర్తిచేసుకున్నాడు.

సంతోషంతో శరీరం వణకడం ప్రారంభించింది. ప్రకృతి కూడా వణుకు తుంది, గాలికి తట్టుకోలేక. యజమానికి కొట్టంమీద కప్పు ఎగిరి పోతుందేమోనని భయంగా వుంది. నాలుగు పక్కలా తడపల్తో గట్టిగాకట్టొచ్చాడు పి ల్లో డు. మామూలుగా అంబలి తాగాడు, మిరపకాయ కొరుక్కుని. అసలు ఆకలే అనిపించ లేదు....కడుపు నిన్ననగా నిండిపోయిందాయే ...!

దొంగతనంగా చూడ్డానికి కళ్ళు విప్పుతున్నట్టు ఆ కా శ ం కళ్ళు విప్పి మెరుస్తూ ప్రపంచంకేసి చూస్తూంది. వాయులీనం ఊదుతున్నట్టు గాలి ఈలలు వేస్తూ పల్టీలు కొడుతున్నది. ఈ గొడవంతా ఎందుకని చ ం ద్రు డు మబ్బుల వెనుక విశ్రాంతి తీసుకుంటున్నాడు.

—ఈ వెదవార్భాటమంతా ఇప్పుడే రావాలా? వెధవది వడ్లు దొరికేయి కాదు....! ఇప్పుడేం చేస్తుంటాడో.... ఇంకా రాలేదెంచేత అని తనకోసం ఎదురు చూస్తూంటాడేమో....

నెమ్మదిగా గాది కిందనుంచి లేచి ఇంటి తలుపుకేసి ఒకసారి చూసి ముందు కడుగువేశాడు. అందరూ తలుపులు బిడాయించుకుని ఇళ్ళల్లో దూరారు. పెంటల మీద విస్తళ్ళలా పక్షుల్లా ఎగురుతున్నాయ్. ఊరుదాటి పొలం గట్టు వేరేసరికి తుంపర్లు ప్రారంభించాయి.. ఈ పాడు గాలీవాన మూలాన్ని కొంపముంచి ఈ రాత్రి కుదరదేమో....భయం వేసి పట్టుదల హెచ్చింది. దోసకాయలు దాచిన పొదను జ్ఞాపకం చేసుకుంటూ, నెత్తిమీద గుడ్డవేసుకుని ముందుకుసాగాడు. మధ్య మధ్యలో మెరుపుల్ని బట్టి దారి తెలుస్తుంది. మొత్తంమీద పొలం చేరుకునేసరికి చినుకులు ఎక్కువయ్యాయి. చీకట్లో తను దోసకాయలు దాచిన పొద కనిపించలేదు తొందరపడిన కొద్దీ ఆలస్యమౌతుంది.

గబ గబా మళ్ళా కాయలు కోశాడు. రెండు పుచ్చకాయలు కూడా తెంపుకుని బయల్దేరాడు. జుట్టు తడిసి చూరు నీళ్లలాగ మొహం మీదకు కారుతున్నాయి వాన నీళ్ళు....

....మంచి కాయలు కోశాడు. వీటిని చూడ్డం తోనే ఒకటి కాకపోతే రెండు పిల్లంగోర్లు పట్టికెళ్ళమంటాడు. ఒకటి చాల్లే అంటాడు తను. పిల్లంగోరు నేర్పేట్ట యితే ఇలా రోజూ ఇస్తానని చెప్తేసరి....ఒక నిమిషంలో నేర్పేస్తాడు.... అది పట్టు కుని ఇంటికొచ్చి ఊత్తే ఖామందు ఆశ్చర్యపోతాడు. ఖామందమ్మ కూడ మూడింతలు ఆశ్చర్యపడుతుంది.

చెట్లకొమ్మలోంచి గాలి దాగుడుమూతలాడుతుంది. వెర్రి సంతోషంతో అడుగులు తేలిపోతున్నాయి.

పుంతదాటి కాలువగట్టు పట్టాడు.

తనకూ, మోళీవాడి గుడారానికీ దూరం తగ్గుతున్న కొద్దీ ఆనందంతో వణికిపోతున్నాడు.

తస్సాదియ్యా....వర్షం మరీ ఎక్కువయిపోతూంది—తనకోసం ఎదురు చూస్తుండి ఉంటాడు....అందరూ ఈ పాటికి ముసుగు బిగించిఉంటారు ... అవును ....అంతే....

రోడ్లమీంచి నీరు కాలవలోకి పోతూంది చెట్లన్నీ వర్షానికి వణికిపోతున్నాయి పెద్దమెరుపు మెరిసింది. ఆ వెంటనే ఉరిమింది.

అదిగో గుడారం... ఇంకెంతో దూరంలేదు. దగ్గిరకొచ్చేసినట్టే....అల్లదిగో..

అదికాదు....తెల్లగాను అయితే చాలా తొందరగానే వచ్చేశాడన్నమాట .. పిల్లం గోరు పుచ్చుకుని వెంటనే వెళ్ళిపోవాలి....ఖామాందుకు గాని తెలిస్తే కూకలేస్తాడు. ఏమీ ఎరగనట్టు తెల్లారిలేచి పనులన్నీ చేసుకుపోవాలి. ఊదడంవచ్చిందాక పిల్లం గోరు ఎవరికీ చూపెట్టకూడదు.... పెణకలో దాచితేసరి....యెవరికీ కనిపించదు....

వంద గజాల్లో కొచ్చాడు

ఇంకో నిమిషంలో అక్కడుండడూ....

గబగబా పరుగెత్తుతున్నాడు. వర్షం చిందుతూంది. ఇంతసేపట్నుంచీగుడారంలో మిణుకు మిణుకుమని వెలుగుతున్న దీపంగాలికి ఆరిపోయింది....

వాయిదేవుడు ఆవులించాడు

వాయులీనం కేకలేసింది

మర్రిచెట్టు ఊగిపోతుంది

దోసకాయలు గట్టిగా పట్టుకున్నాడు. మరినాలుగడుగులున్నాయి.

ధడేల్‌మంది ఉరుము

వాయుదేవుడి నరాలు తెగాయి

కొబ్బరిచెట్టు ఊగి ఊగి ఫెళ ఫెళమంది

"వాయులీనం, వాయులీనం" అనుకున్నాడు పిల్లోడునోట్లో-నోట్లోమాటలు నోట్లో ఉండగానే అతనిమీద కొబ్బరిమానుంది. చేతులో ఉన్న దోసకాయలు జారిపోలేదు....పట్టుతప్పించుకుని పుచ్చకాయలు పారిపోలేదు..ప్రాణం మూలగలేదు హృదయం ఏడవలేదు. కొబ్బరి చెట్టు అడుగున దాక్కున్నాడు పెదాలు వాయు లీనం అనడం మానలేదు...మనసు పిల్లంగోరు గురించి ఆలోచిస్తూంది.

గాలి ఇంకా ఊళలు వేస్తూ పల్టీలు కొడుతూంది. కాల సీటోకి నురగలు కట్టాయ్—మర్రి చెట్టు ఊడలు ఊగుతున్నాయ్.

విసుపొచ్చిందాక కురిసి కురిసి వర్షం ఇక కురవడం మానేసింది. పల్టీలు కొట్టి కొట్టి గాలిదేవుడికి కాలు బెణికి నట్టుంది. ఆకాశం మెరవడం మానేసింది....

సూర్యుడు ఉదయించడం మానలేదు....

గాలివానకు ఎగిరిపోతుందనుకున్న గుడారం ఎగిరిపోలేదు. అదంతా తన మంత్రిశక్తనుకున్నాడు మోళీ ఆసామీ.... రాణీ అన్న గుడారం తడిక ఒత్తిగించుకుని నోట్లో మర్రిఊడపెట్టుకునిబయటికొచ్చాడు ...

పిల్లంగోరు తయారు చెయ్యడానికి తెచ్చిన వెదురు కర్రతో రాణి ఆడుకుంటూంది....

బూరచేసుకోవడానికి కొబ్బరి ఆకులు దగ్గరగా అందుబాటులో ఉన్నాయ్. వెట్టు ఆకుల్లో దోసకాయలు కనిపించాయి. ఆ కాయల్ని పట్టుకొని ఒక చెయ్యి కనిపించింది. ముందుకు వంగిచూశాడు.... ఎవరో మనిషి....

భయమేసింది రాణి అన్నకు .. ఒక్క ఉరుకున అయ్య దగ్గరకెళ్ళి వాలాడు "యేటాి ఆ పరుగూ" అన్నాడతను విరాగ్గా..ఆకేక విని రాణి ఉలిక్కిపడింది..

"మనిషి..అవును నిజంగానే..ఎవరో మనిషి చెట్టుకింద పడుకున్నాడు...." ఎందుకో తెలియని తడబాటు—

"యెవడాి! యేటి నువ్వు నేది! యెక్కడంట"?

ముందు పరుగెత్తాడు....గుడారం బయటికొచ్చి పడిపోయిన కొబ్బరిచెట్టు చూశాక కొడుకు మాటల్లో నమ్మకం కలిగింది....కూడావెళ్లాడు....

"ఇదిగో యే( కనిపించిందా?" కొబ్బరాకులు ఒత్తిగించి చెయ్యిచూపించాడు నిజమే! బలమంతా ఉపయోగించి ఒక్కమెట్టు నెట్టాడు మాిను. రాణి అన్న ఆశ్చర్యపోయాడు...పిల్లోడు ... నోట్లోంచి రక్తం! పిల్లంగోరు కోసం రాత్రి అతన్ని రమ్మన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. రాత్రి వెన్నెలుంటుందిగనుక గుడిసె దగ్గరకొచ్చి ఈలవేస్తే బయటికొస్తానని చెప్పాడు తను.... ఒక పిల్లంగోరు చేసి పెడితే దోసకాయలూ పుచ్చకాయలూ ఇస్తానని ఒప్పుకున్నాడు... ఈ సంగతి తండ్రికి చెప్దామా, మాన్దామా అనుకుంటూనే మానేశాడు ...

మోళీఅతను అలాచూస్తూ ఉండిపోయాడు....సలుగురైదుగురు దారినపోయే వాళ్లు పోగయ్యారు ...చూస్తుండగనే జనం పెరిగిపోయారు ...

"నేను'అయులీనం' నేర్చుకుంటా," కుర్రాడింకా ఆమాటలంటున్నట్టే ఉంది.

ఇంతలో ఆ కుర్రాడి యవమాని, అతనువాడిన "వాయులీనం" అనే పదానికి అర్ధంతెలియని ఆసామీ, ఇంకా కొందర్ని వెంటబెట్టుకుని వచ్చాడు ...గుంపుల్నిల్ని తోసుకుని పిల్లోణ్ణి చూశాడు .. అతనికీ ఇతనికీ ఉన్న సంబంధం తెలియని మోళీ ఆసామీ స్తబ్ధుగా నిలబడ్డాడు అతగాడు కుర్రాడి పెదాలకేసి చూస్తున్నాడు. ....పేరులేని పిల్లాడు ఎవరికేసీ చూడటంలేదు. వాయులీనం నేర్వలేదు గనక అతను మరెక్కడికో బయల్దేరాడు నేర్చుకోవడానికి. వాయులీనం నేరుకోవడానికి వెళ్తున్నానన్న ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది....

వాయులీనం నేర్చుకోవడంకోసం పిల్లాడు వాయువులో లీనమయ్యాడు....!

రచన; 4-5-1961; ప్రచురణ: ఆంధ్రప్రభ, సచిత్రవారపత్రిక 15-11-61